# కష్టారితం

**ఋజు**

పరంధామయ్యగారు యెంతో జాగ్రత్తగల వ్యక్తి. ముఖ్యంగా మనీమేటర్స్‌లో యెప్పుడూ నిర్మొహమాటంగా వ్యవహరిస్తారు. ఒకరికి డబ్బు యిచ్చేటప్పుడు లేదా వొకరి వద్ద నుంచి తను డబ్బు పుచ్చుకునేటప్పుడు నాలుగైదు పర్యాయాలు లెక్క పెట్టందే తృప్తి చెందరు.

అటువంటిది ఈరోజు ఆయన పర్స్ పోగొట్టుకున్నారు. పర్స్‌లో మూడు వందలున్నాయి.

జరిగిందేమిటంటే పరంధామయ్యగారు ఉదయాన్నే జనతాలో దిగి స్టేషన్ నుండి గంట స్తంభం వరకూ రిక్షాలో వచ్చేరు. గంట స్తంభం వద్ద రిక్షా దిగి రిక్షావాడికి డబ్బులిచ్చేసి ఎదురుగా వున్న పళ్ళ దుకాణంలో నాలుగు ఏపిల్ పళ్ళు కొని చేతి సంచీలో వేసుకొన్నారు. తరువాత పువ్వుల దుకాణంలో ఓ అరవంద చేమంతి పువ్వులు కట్టించేరు. పువ్వుల దుకాణం వాడికి డబ్బులిద్దామని జేబులో చెయ్యి పెట్టేసరికి పర్స్ లేదు. ఆతృతతో వెదికేరు. పర్స్ దొరకలేదు. ఎవరో కొట్టేశారు అనుకున్నారు.

"పరంధామయ్యగారికి ముచ్చెమటలు పోశాయి. పళ్ళ దుకాణం నుంచి, పువ్వుల దుకాణానికి వచ్చేలోపల పర్స్ ఎవరో కాజేసేరు. పరంధామయ్యగారు జరిగిందానికెంతో విచారించేరు. అతని చేతిలో ఎన్నడూ చిల్లిగవ్వ కూడా పోలేదు. అటువంటిదీ రోజు పర్స్‌తో పాటు మూడు వందల రూపాయలు పోయేయి.

గంట స్తంభం ప్రాంతంలో ఎప్పుడూ రష్ జాస్తిగానే వుంటుంది. అందులో ఆదివారం నాడు ఆ వూర్లో సంత జరుగుతుంది. జనం విపరీతంగా వుంటారు. ఆదివారం నాడు పెద్ద బజార్లోకి వెళ్ళడం చాలా కష్టం. ఏ మాత్రం ఏమరుపాటున వున్నా పోకెట్స్ గల్లంతే.

పువ్వుల వాడికివవ్వడానికి మరి అతని వద్ద డబ్బుల్లేనందువల్ల పువ్వులు వాపస్ చేసి అర ఫర్లాంగు దూరంలో వున్న టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కి వెళ్ళేరు రిపోర్టిద్దామని.

వెంటనే పోలీస్ రిపోర్టిస్తే ఏమైనా లాభం వుంటుందనే ఆశతో నేరుగా సి.ఐ. దగ్గరకు వెళ్ళి నమస్కరించి తన పర్స్ పోయిన విషయం చెప్పేరు పరంధామయ్యగారు.

సి.ఐ. గారు ఓమారు ముఖం చిట్లించి "తెల్లారేసరికి పిక్‌పోకెటా కేసేమిటని విసుక్కుని ప్రక్కనే వున్న యస్.ఐ. గారితో

"అదేవిటో కాస్త చూడవోయ్ మూర్తి" అన్నారు.

యస్సై మూర్తిగారు పరంధామయ్యగార్ని తన రూంలోకి తీసుకెళ్ళేరు.

"చెప్పండి" అన్నారు.

పరంధామయ్యగారు జరిగిందంతా చెప్పేరు.

"సార్! తమరు వెంటనే యెవరినైనా పంపిస్తే దొంగ పరిసర ప్రాంతాలు దాటిపోకుండా పట్టుకోవచ్చు" అన్నారు ఆతృతతో.

యస్సైగారు మాత్రం తొందరపడలేదు. అతనికి యిటువంటి చిల్లర దొంగతనాలు ఇన్‌వెస్టిగేట్ చెయ్యడమంటే యెలర్జీ! అందుచేత హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు వస్తే అతనికి ఈ కేస్ ఒప్పగించాలనుకుంటున్నారు.

తను రిపోర్టిచ్చి పావుగంటైనా ఎవరూ సరియైన యాక్షన్ తీసుకోనందుకు పరంధామయ్యగారికి కోపం వచ్చింది.

"మీ ఫోన్ ఓ పర్యాయం వాడుకుంటా" అని రిసీవర్ ఎత్తి నంబర్ డైల్ చేశారు.

అవతలవేపు తనకు కావాల్సిన వ్యక్తి గొంతుక విన్పించగానే సంతోషించి-

"నేను పరంధామయ్యను... మీ టూటౌన్ పోలీస్ స్టేషన్‌నుంచి మాట్లాడుతున్నా.... ఉదయం జనతాలో వచ్చేను. నువ్వు అర్జంటుగా ఇక్కడకు రా. అన్ని విషయాలు మాట్లాడుకుందాం...." అంటూ ఫోన్ పెట్టేశారు.

మరో పది నిముషాల్లో యస్.పి. రాజశేఖరంగారి కారు వచ్చి పోలీస్ స్టేషన్లో ఆగింది. యస్.పి. గార్ని చూడగానే పోలీస్ స్టేషన్ ఒక్కమారు చైతన్యం చెందింది. సి.ఐ.గారు యస్సైగారు యస్.పి.గారి దగ్గరకు వచ్చి సెల్యూట్ చేసేరు.

యస్.పి.గారు నేరుగా స్టేషన్‌లోకి వచ్చి యస్సై రూంలో బెంచీ మీద కూర్చున్న పరంధామయ్యగార్ని చూసి.

"ఏమిటి బాబాయ్! ఏం జరిగింది. ఇక్కడెందుకున్నావ్?" అన్నారు ఆశ్చర్యంతో.

పరంధామయ్యగారు యస్.పి. గారి చిన్నాన్నగారని తెలియగానే యస్సైగారు సి.ఐ. గారు నిర్ఘాంతపోయేరు.

"మరేం లేదు సార్! అయ్యగారి పర్స్ మార్కెట్‌లో ఎవడో పిక్‌పాకెట్ చేసేడుట. రిపోర్టిద్దామని వచ్చేరు సార్! మన యస్సై మూర్తిగారు కేస్ టేకప్ చేసేరు సార్! వెంటనే రికవర్ చేసేస్తాం సార్!" అన్నారు సి.ఐ.గారు తడబడుతూ.

యస్సై మూర్తిగారు ఇద్దరు కానిస్టేబుల్స్‌ని తీసుకొని బయటకు పరిగెత్తారు.

"ఓ.కే. మేం ఇంటికి వెళ్తున్నాం. ఓ గంటలో నాకు పొజిషన్ యింటికి ఫోన్ చేసి చెప్పండి" అని, "పద బాబాయ్" అంటూ పరంధామయ్యగార్ని తీసుకొని వెళ్ళిపోయేరు యస్.పి. రాజశేఖరంగారు.

యస్.పి. రాజశేఖరంగారు పరంధామయ్యగారి అన్న కుమారుడు. రాజశేఖరం గారు రెండు మాసాల క్రితం నెల్లూరు నుంచి ట్రాన్స్‌ఫరై వచ్చేరు. రాజశేఖరంగార్ని పిల్లల్ని ఓ పర్యాయం చూసిపోదామని పరంధామయ్యగారు వచ్చేరు.

రాజశేఖరంగారు, పరంధామయ్యగారు ఇంటికి వచ్చిన మరో అరగంటకు ఎస్సై మూర్తిగారు వచ్చి యస్.పి. గారికి సెల్యూట్ చేశారు.

"మనీ రికవర్ చేసేసేను సార్! ఇదుగో" అంటూ మూడువంద రూపాయల నోట్లు యస్.పి. దొరగారి ముందుంచి!

"సార్! పర్స్ మాత్రం దొరకలేదు సార్. వాడు పర్స్‌లో డబ్బు తీసి ఖాళీ పర్స్‌ను తగలబెట్టేసేడుట" అంటూ యింకా ఏమో చెప్పబోయేరు యస్సైగారు.

"దట్సాల్ రైట్! యు కెన్ గో!" అన్నారు యస్.పి.గారు.

"యస్సార్! అంటూ మరొకమారు సెల్యూట్ చేసి వెళ్ళిపోయేరు యస్సైగారు.

పరంధామయ్యగారు పోయిన డబ్బు తిరిగి దొరికినందుకు ఎంతో సంతోషించేరు. "కష్టార్జితం ఎక్కడికీ పోదు" అనుకున్నారు.

"స్నానానికి వేడినీళ్ళు సిద్ధం చేసేనని బోయ్ చెప్పడంతో పరంధామయ్యగారు టవల్ కోసం చేతిసంచీ తీసేరు. అందులో టవల్ ఏపిల్ పళ్ళతో బాటు అతని పర్స్ కూడా కన్పించేసరికి ఎంతో ఆశ్చర్యపోయేరు.

"ఇంతకూ తన పర్స్ పోలేదన్నమాట! ఏపిల్ పళ్ళతో పాటు తనే దాన్ని పొరపాటున చేతి సంచీలో పడవేసి వుండాలి. అయినా కష్టార్జితం ఎలా పోతుంది?" అని మరొకమారు తనను తాను సమాధాన పర్చుకున్నారు పరంధామయ్యగారు.

"మరి యస్సైగారు రికవర్ చేసి యిచ్చిన మూడువందలూ యెవరి కష్టార్జితమో?"

*'ఆంధ్రజ్యోతి' వీక్లీ, 20-4-1979*